క్లుప్తంగా

అమ్మవారికి వెండి హస్తం బహూకరణ


అమ్మవారికి భక్తులు అందించిన వెండి హస్తం

రంగంపేట: మండలంలోని చంద్రేడులో కొలువైయున్న శ్రీదేవి కనకదుర్గ అమ్మవారికి భక్తులు వెండి హస్తం బహూకరించినట్లు ఆలయ అర్చకుడు ఎం.కృష్ణశర్మ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన బొడ్డు వెంకట్రావు, మంగాయమ్మ దంపతులు తమ సొంత ఖర్చుతో అమ్మవారికి వెండి హస్తం చేయించారన్నారు. శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారికి హస్తం అలంకరించామన్నారు.

గాడ్గేబాబా జయంతి


గాడ్గేబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మురముళ్ల వెంకటరమణ

పెదపూడి: మండలంలోని జి.మామిడాడ గ్రామ శివారు ఎల్ఎస్‌పురంలోని ఎస్సీపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గాడ్గేబాబా 148వ జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ కోకన్వీనర్ మురముళ్ల వెంకటరమణ గాడ్గేబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాడ్గేబాబా తన జీవిత కాలంలో సుమారు 141 సేవా సంస్థలను స్థాపించి, సమాజ సేవ చేశారని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ కేవీవీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు కేటీ భారతి, ఎంవీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హోం ఓటింగ్‌కు అర్హులను గుర్తించండి


సమావేశంలో తహసీల్దార్ రాజ్యలక్ష్మి

మధురపూడి: హోం ఓటింగ్‌కు అర్హులను గుర్తించాలని కోరుకొండ తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం కోరుకొండలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో హోం ఓటింగ్ నిర్వహిస్తారన్నారు. దీనికి 80 ఏళ్లు దాటిన వృద్ధులు, పోలింగ్ కేంద్రాలకు రాలేని వారు, పక్షవాతం, దివ్యాంగులు అర్హులన్నారు. కొందరి వివరాలను బీఎల్ఓల ద్వారా సేకరించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ నరేష్ పాల్గొన్నారు.

బేటీ బచావో, బేటీ పఢావో


సమావేశంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శ్రీగౌరి

పెదపూడి: పెదపూడిలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో శుక్రవారం బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీగౌరి మాట్లాడుతూ బాలికలంతా ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహించాలని సూచించారు. లింగ వివక్షను విడనాడి అమ్మాయిలకు అన్నింటా సమాన హక్కులు కల్పించాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలన చట్టంపై అందరికీ అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

రాజానగరం: తోకాడ గ్రామంలో ఆయిల్‌పామ్ తోటల పెంపకంపై రైతులను చైతన్యపరుస్తూ శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పతంజలి ఫుడ్స్, ఉద్యాన శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సర్పంచ్ వేగిశెట్టి వీవీ చక్రధరరావు, ఉద్యాన శాఖ డీజీఏ రవీంద్ర, పతంజలి ఫుడ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల దాడులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కేవీఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు శుక్రవారం స్థానిక కోరుకొండ రోడ్డులోని శ్రీలక్ష్మీ కర్రి పాయింట్‌పై దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ఐదు గృహ సిలిండర్లను వాణిజ్య ప్రయోజనం కోసం వినియోగిస్తుండటంతో అర్బన్ ఎంఎస్ఓ నాగలక్ష్మి వాటిని స్వాధీనం చేసుకున్నారు. కర్రీ పాయింట్ యజమాని బలుసు ఆదినారాయణపై 6ఏ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ డొమెస్టిక్ సిలిండర్ల వినియోగంలో అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంపూర్ణ పోషణ.. మాతాశిశు రక్షణ

- ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో సత్ఫలితాలు
- గర్భిణులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందజేత


గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త


గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

పెదపూడి: మాతాశిశు సంరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి నెలనెలా వైద్య పరీక్షలు చేయడం, ఆరోగ్య జాగ్రత్తలు వివరించడం, అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పౌష్టికాహారం సరఫరా చేయడం, రక్తహీనతతో బాధపడేవారికి ముందస్తుగానే వైద్యం చేస్తుండటం తదితర చర్యలతో శిశు మరణాల నమోదు గణనీయంగా తగ్గడంతో పాటు ఆరోగ్యవంతమైన శిశువులు జన్మిస్తుండటం శుభ పరిణామం.

సంపూర్ణ పోషణ కిట్లు

మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలి. హెచ్‌బీ(హిమోగ్లోబిన్) సరిపడా ఉంటే ప్రసవ సమయంలో ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఈ నేపథ్యంలో శిశువులు బలంగా ఆరోగ్యంగా ఉండేందుకు మంచి పౌష్టికాహారం తీసుకోవాల్సి ఉంటుంది. దీని కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నెలకు సరిపడా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా రాగి పిండి, బెల్లం, ఎండు ఖర్జూరం, వేరుశనగ చిక్కీలు, గుడ్లు, బియ్యం, నూనె, పాలు క్రమం తప్పకుండా సరఫరా చేస్తున్నారు.

నెలనెలా వైద్య పరీక్షలు

గర్భిణిగా రిజిస్టర్‌లో ఏఎన్ఎం వివరాలు నమోదు చేసినప్పటి నుంచి ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ప్రతి గర్భిణికి ప్రసవించేలోగా నాలుగు యాంటినేటల్ చెకప్స్(ఏఎన్‌సీని వైద్యులు) నిర్వహిస్తారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి నెలనెలా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తున్నారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఎప్పటికప్పుడు గర్భిణుల ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకుంటూ సకాలంలో వైద్యం అందేలా చూస్తున్నారు. గర్భిణులు ఓవైపు పౌష్టికాహారం తీసుకుంటూ వైద్యుని సలహా మేరకు మందులు వాడటంతో గర్భంలో శిశువు ఎదుగుదల బాగుంటోంది. ఈ చర్యల కారణంగానే ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆరోగ్యకరమైన శిశువులు జన్మిస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు, గర్భిణులు, బాలింతల వివరాలు..

మండలం	అంగన్‌వాడీ కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు
అనపర్తి	66	317	261
రంగంపేట	48	324	257
పెదపూడి	81	331	365
బిక్కవోలు	70	297	304
మొత్తం	265	1269	1187

పోషక విలువలున్న ఆహారం



నేను గర్భం దాల్చినప్పటి నుంచి ప్రతి నెలా అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం అందించిన పౌష్టికాహార కిట్లు తీసుకున్నాను. పాలు, గుడ్లు, చిక్కీలు, ఖర్జూరం వంటి పోషక విలువలున్న ఆహారం తినడంతో సుఖ ప్రసవం జరిగింది. బాబు పుట్టి నెలవుతుంది. బాబు ఆరోగ్యంగా ఉన్నాడు.

– కడిమి లక్ష్మీప్రసన్న, బాలింత, పుట్టకొండ

ఎంతో మేలు జరిగింది



నాకు ఆరు నెలల క్రితం పాప పుట్టింది. గర్భిణిగా ఉన్నప్పుడు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించిన పౌష్టికాహారం చాలా బాగుంది. వైద్య సిబ్బంది సూచనల మేరకు మందులు వాడటంతో పాటు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడంతో ఎంతో మేలు జరిగింది. పాప ఆరోగ్యంగా ఉంది.

– బుంగా దుర్గ, బాలింత, పుట్టకొండ

ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు



నేను గర్భిణిగా ఉండగా ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు నా ఆరోగ్య సమాచారం గురించి ఎప్పటికప్పుడు ఆరా తీసి సలహాలు ఇచ్చేవారు. వైద్యులు ప్రతి నెలా వైద్య పరీక్షలు చేసి జాగ్రత్తలు చెప్పేవారు. అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఇచ్చిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లతో మంచి పౌష్టికాహారం అందింది.

– బూర చార్మి, బాలింత, పుట్టకొండ

ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోవాలి

సీతానగరం: ఐదేళ్లు నిండిన పిల్లలు ప్రైవేట్ స్కూళ్లలో ఒకటో తరగతి ఉచితంగా చదివేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈఓ కె.స్వామినాయక్ తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2017 మార్చి 31 నుంచి 2018 మార్చి మధ్యలో జన్మించిన పిల్లలు వచ్చే నెల పది లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనాథలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులకు 5 శాతం, ఎస్సీలకు పది శాతం, ఎస్టీలకు నాలుగు శాతం, బలహీన వర్గాలకు చెందిన బీసీ, మైనార్టీ, ఓసీల్లో ఏడాదికి ఆదాయం రూ.1.20 లక్షల లోబడి ఉన్న కుటుంబాల్లో పిల్లలకు ఆరు శాతం రిజర్వేషన్లు ఉంటాయన్నారు. ఐదేళ్లు నిండిన పిల్లలుంటే ఆయా గ్రామాల్లోని సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ వద్దకు వెళ్లి ప్రభుత్వ వెబ్‌సైట్‌కి లాగిన్ అయి రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. ప్రైవేట్ స్కూల్‌కు 3 కిలోమీటర్లు పరిధిలో నివసిస్తున్న దరఖాస్తుదారులను పరిగణనలోకి తీసుకుంటారన్నారు.

బాధితులకు పరామర్శ

మధురపూడి: కోరుకొండ మండలానికి చెందిన పలువురు బాధితులు రాజమహేంద్రవరంలోని పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వారిని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి రాజశ్రీ శుక్రవారం పరామర్శించారు. జంభూపట్నానికి చెందిన సీత చెయ్యి విరిగి చికిత్స పొందుతుండగా, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కణుపూరుకు చెందిన ఇల్లపు సాయి మణికంఠ, కోటి గ్రామానికి చెందిన సుంకర లక్ష్మణ్, నర్సాపురానికి చెందిన మరుకుర్తి త్రిమూర్తులు, రాజానగరం మండలం తోకాడకు చెందిన గంగా భవానీలను ఆమె పరామర్శించారు.

ఆరోగ్య సురక్షతో పేదలకు రక్ష


బలభద్రపురంలో రోగులకు మందులు అందిస్తున్న నాయకులు


పురుషోత్తపట్నంలో కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ సత్యప్రసాద్

బిక్కవోలు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో నిరుపేదల ఆరోగ్యానికి రక్ష లభిస్తుందని సర్పంచ్ బుంగా రామారావు అన్నారు. శుక్రవారం బలభద్రపురంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి అశోక్ కుమార్, ఉప సర్పంచ్ నల్లమిల్లి వెంకటరెడ్డి, ఎంపీటీసీ మేడపాటి ఆనంద్‌రెడ్డి, బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యురాలు దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో మేలు

సీతానగరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంతో పేదలకు మేలు జరుగుతుందని జెడ్పీటీసీ సభ్యులు చల్లమళ్ల వెంకటలక్ష్మి, సర్పంచ్ ఎస్.అనురాధ, ఎంపీటీసీ జి.ఏసమ్మ అన్నారు. శుక్రవారం పురుషోత్తపట్నం ఎంపీయూపీ స్కూల్‌లో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు 416 మందికి సేవలు అందించారు. పీహెచ్‌సీ వైద్యుడు ఎస్.రాజు, సిద్ధార్థ నర్సింగ్ హోమ్ నుంచి వచ్చిన కీళ్ల వ్యాధుల స్పెషలిస్ట్ డి.మానీష్, హృద్రోగ నిపుణులు స్నేహారెడ్డి వైద్య సేవలు అందించారు. కంటి వైద్య నిపుణుడు సత్య ప్రసాద్ 80 మందికి పరీక్షలు చేసి 61 మందికి కళ్లజోళ్లు అవసరమని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. 228 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. గతంలో సిఫార్స్ చేసిన వారికి కళ్లజోళ్లు అందించారు. వైఎస్సార్ సీపీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, వెలిచేటి మోహన్‌బాబా (సిరి), కె.శరత్‌బాబు, సూరిబాబు, సీహెచ్ఓ పి.వెంకటరత్నం, ఎమ్‌పీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, సూపర్‌వైజర్లు కె.సుధాకర్, డి.దైవకృప తదితరులు పాల్గొన్నారు

వలంటీర్లకు పురస్కారాల ప్రదానం


కోరుకొండలో వలంటీర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే సతీమణి జక్కంపూడి రాజశ్రీ

మధురపూడి: వలంటీర్లు సంక్షేమ సారథులని ఎమ్మెల్యే రాజా సతీమణి జక్కంపూడి రాజశ్రీ అన్నారు. కోరుకొండ సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థతోనే వృద్ధులు, వికలాంగులకు ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి వద్ద పింఛన్లు అందుతున్నాయన్నారు. జగనన్న ప్రభుత్వం వలంటీర్లను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా చూస్తుందన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా ప్రజలకు అనేక రకాలుగా మేలు జరుగుతుందన్నారు. అనంతరం వలంటీర్లకు పురస్కారాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, సెక్రటరీ రమేష్‌బాబు, మండల కో ఆప్షన్ సభ్యుడు గొల్లపల్లి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సూర్య కల్యాణం


సూర్య కల్యాణం జరుపుతున్న నిర్వాహకుడు కుమార్‌శర్మ తదితరులు

సీటీఆర్ఐ: స్థానిక పేపర్‌మిల్లు రోడ్డు సీతంపేటలో షోడశ దిన ప్రయుక్త 'పంచాయతన పూర్వక సూర్యారాధన'లో భాగంగా సూర్య భగవానుడికి విశేష పూజలు, అభిషేకాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా యాగ నిర్వాహకుడు వడలి కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం సూర్యనమస్కారాలు, హోమాలు, శతచండీ పారాయణ, హోమం, సుదర్శన మంత్రానుష్టానం, హోమం, శ్రీలక్ష్మీ గణపతి జపం, అష్టద్రవ్య హోమాలు, రుద్రాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహిస్తున్నారు. అనంతరం సూర్య కల్యాణం వైభవంగా జరిగింది. ఈ పూజలను తిలకించిన భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వ రోగాలను నివారించే శక్తి సూర్యారాధనలో ఉంటుందన్నారు. శనివారం శ్రీమహాలక్ష్మి ఆరాధన, జ్యోతిర్లింగార్చన జరుగుతుందన్నారు. 25న ఉదయం 10.30 గంటలకు పూర్ణాహుతి నిర్వహిస్తారన్నారు. భక్తులంతా విచ్చేసి స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కుమార్‌శర్మ పిలుపునిచ్చారు. అనంతరం సుమారు 10 వేల మందికి అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి


తొర్రేడులో విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థులు సమయ పాలన పాటిస్తూ ప్రణాళికాబద్ధంగా చదివితే పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. శుక్రవారం తొర్రేడులోని జెడ్పీ హైస్కూల్‌ను ఆయన సందర్శించి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రీ పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు లక్ష్య సాధన దిశగా చదవాలన్నారు. ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు, రివిజన్ టెస్ట్‌లను చక్కగా వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్ఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తొర్రేడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను వాసుదేవరావు సందర్శించి ఫార్మేటివ్–4 పరీక్షల నిర్వహణను పరిశీలించి సూచనలు చేశారు. హెచ్ఎం.ఎం.అనురాధ పాల్గొన్నారు.

సేవా వారధులు.. వలంటీర్లు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అనపర్తిలో వలంటీర్లకు అవార్డుల ప్రదానం


వలంటీర్లను పురస్కారాలతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తదితరులు

అనపర్తి: ప్రభుత్వం సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రతి లబ్ధిదారుడికి సకాలంలో చేరవేస్తున్న సేవా వారధులు వలంటీర్లు అని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక తేతలి రామిరెడ్డి, మంగాయమ్మ కళావేదిక ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల పరిధిలో ఎంపికైన వలంటీర్లకు ఎమ్మెల్యే సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి పారదర్శక పాలనకు నాంది పలికారని అన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో వలంటీర్లు సేవా దృక్పథంతో రోగులకు ఆప్త బంధువులుగా సేవలందించారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు ఏర్పాటు చేసిన జన్మభూమి కమిటీలతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన వలంటీర్లు ప్రభుత్వ సేవలు, ప్రభుత్వ పథకాలను ప్రజల ఇంటి ముంగిటకే అందిస్తున్నారని చెప్పారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడంలో వలంటీర్ల కృషి అభినందనీయమన్నారు. సీఎం జగనన్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా పనిచేయాలని, వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాకముందు, అధికారాన్ని చేపట్టిన తరువాత ఉన్న పరిస్థితులు, వివిధ సంక్షేమ పథకాల అమలుతీరుపై ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. వలంటీర్ల వ్యవస్థను మరింత పటిష్ట పరిచే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని, దీంతో వలంటీర్లకు మరింత మేలు జరిగి భవిష్యత్తు బాగుంటుందని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా సేవా వజ్ర అవార్డుకు ఎంపికైన మండలంలోని రామవరం గ్రామ సచివాలయం–2కు చెందిన మల్లిడి మౌనికాదేవి, సేవా రత్న అవార్డులకు ఎంపికైన ఎ.లక్ష్మీసుగుణాదేవి(పొలమూరు గ్రామ సచివాలయం–2), పి.వేణి(కొప్పవరం), ఎస్.పద్మావతి(అనపర్తి–5), ఎన్.ఉష(అనపర్తి–2), సబ్బెళ్ల సత్యవేణి(మహేంద్రవాడ–1)లతోపాటు సేవా మిత్ర పురస్కారాలకు ఎంపికైన వలంటీర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సర్పంచ్ వారా కుమారి, రాష్ట్ర రెడ్డి, భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్లు సత్తి రామకృష్ణారెడ్డి, షణ్ముఖి చిట్టిరాజు, అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, ఈఓపీఆర్డీ పద్మజ, పంచాయితీ కార్యదర్శి మల్లిడి విజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ వసంతం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- రఘునాథపురంలో గడప గడపకూ..
- రూ.70 లక్షలతో ఓహెచ్ఆర్‌కు శంకుస్థాపన


రఘునాథపురంలో తాగునీటి కుళాయిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ వసంతం వచ్చిందని ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. శుక్రవారం రఘునాథపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును తెలుసుకుని, ఆయా కుటుంబాలకు ఏ మేరకు ప్రయోజనం చేకూరిందో కరపత్రాలు అందించారు. సుపరిపాలన అందిస్తున్న జగనన్న సర్కారుకు మరో అవకాశం ఇచ్చి, రాష్ట్ర ప్రగతిలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే రాజా కోరారు. తొలుత శ్రీరామపురంలో జల్‌జీవన్ మిషన్ నిధులు రూ. 70 లక్షలతో ఓహెచ్ఆర్ ట్యాంక్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. రూ. 21.80 లక్షలతో నిర్మించిన హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం రఘునాథపురంలో పర్యటించిన ఆయన ఎస్సీపేటలోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ప్రభుత్వం తమదేనని సగర్వంగా చెప్పగలుగుతున్నామని రాజా తెలిపారు. ప్రజా సంక్షేమంతోపాటు రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్న జగనన్న పాలన ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ప్రజలను జలగల్లా పీడించాయని గుర్తు చేశారు. జగనన్న పాలనలో వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే పథకాలు చేరుతున్నాయన్నారు. రఘునాథపురంలో ఆర్థిక ఇబ్బందులతో 10వ తరగతితోనే చదువుకు స్వస్తి చెప్పకుండా కొత్తపల్లి శైలజ, సోనీల ఉన్నత చదువులకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తన వ్యక్తిగత సిబ్బందిని ఆదేశించారు. జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, వాడ్రేవు శ్రీను, వేమగిరి కృష్ణ, బోయిడి రాంబాబు, సుబ్రహ్మణ్యం, గున్నూరి శ్రీను, పలివెల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల రాకతో గ్రామాల చెంతకే పాలన

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- జి.దొంతమూరు, కోటపాడులో ప్రభుత్వ భవనాల ప్రారంభం


కోటపాడులో ఆర్‌బీకేని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాల ఏర్పాటుతో గ్రామాల చెంతకే పాలన వచ్చిందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని జి.దొంతమూరులో రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, రజకుల కమ్యూనిటీ భవనాన్ని, కోటపాడులో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో గ్రామాల్లో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఇళ్ల స్థలాల పట్టాలు, కుల ధ్రువీకరణ తదితర సేవలు పొందాలంటే కాళ్లు అరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టగానే సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలను ప్రవేశపెట్టి అత్యంత పారదర్శకంగా పథకాలు అందిస్తున్నారన్నారు. సచివాలయాల ద్వారా సుమారు 630 పైగా సేవలు అందిస్తూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదర్శ పాలనను సాగిస్తున్నారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని పండగగా మార్చేందుకు గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌బీకేలను తీసుకొచ్చారన్నారు. కల్తీ జాడ లేకుండా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతో పాటు రైతులకు అవసరమైన సేవలన్నీ రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.

ఎన్నికలు దగ్గర పడుతుండటంతో చంద్రబాబు మళ్లీ మాయమాటలు చెబుతున్నాడని, ఆయన్ని ఎవరూ నమ్మవద్దన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన మంచిని గుర్తించి మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు, సర్పంచ్‌లు గోలి రమణ, గవరసాని లక్ష్మీదుర్గ, ఎంపీటీసీ గోలి వెంకటకృష్ణ, సుంకర అప్పారావు, ఎంపీడీఓ ఎం. వెంకటేశ్వరరావు, పంచాయితీరాజ్ జేఈ కె. శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి తీర్థ మహోత్సవాలు

రాజానగరం: నరేంద్రపురంలోని పంట పొలాల మధ్య కొలువైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల (త్రిమూర్తులు) ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఐదు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి, స్వామివార్లను దర్శించుకుంటారు. మెట్ట ప్రాంతంలో త్రిమూర్తులు కొలువైన ఆలయం ఇదొక్కటే కావడంతో రాజానగరం, కోరుకొండ, గోకవరం, గండేపల్లి, జగ్గంపేట, రంగంపేట, రాజమహేంద్రవరం రూరల్ మండలాల నుంచి కూడా భక్తులు అధికంగా వస్తారు. ఈ సందర్భంగా వచ్చే భక్తులకు మధ్యాహ్నం సమయంలో కొంతమంది దాతలు ఉచిత భోజన సదుపాయం కల్పించడంతో పాటు చిన్నారులకు పాలను సరఫరా చేస్తారు. రాత్రి సమయాల్లో వచ్చే భక్తులను అలరించే విధంగా ఈ ఐదు రోజులూ పలు సాంస్కృతి కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు.